# వసంతాగమనం

## పాలకూర సీతాలత

వెంకటపతిగారు కళ్ళజోడులోంచి తీక్షణంగా చూస్తూ—

"అబ్బబ్బ... నన్ను విసిగించకుండా సీట్లలో కూర్చుని పనులు చేసుకోండయ్యా..." అన్నారు. అలా అనడంలో ప్రాధేయ పడడమే కనపడుతుంది.

అదొక ఆఫీసు. అందులో సెక్షనాఫీసరు వెంకటపతిగారు. ప్రస్తుతం మేనేజరు శలవులో వున్నందువల్ల ఇప్పుడు ఆయనే ఆ ఆఫీసులో పెద్ద. స్వతహాగా మెత్తటి మనస్తత్వం కావడంవల్ల తన క్రింద పనిచేస్తున్నవాళ్లమీద అజమాయిషీ చెయ్యలేదు. ఒక ఏడాదిలో రిటేరు కాబోతున్న ఆయనంటే ఎవ్వరికీ భయంలేదు. ఆయన ఏదైనా పని చెప్తే 'అలాగే అంకుల్' అంటూ తల ఊపుతారు తప్ప సీరియస్‌గా ఎవ్వరూ తీసుకోరు. ఆయనకు భయపడి పనిచెయ్యడం అన్నది అసలు లేదు. ఇప్పుడు మేనేజరు లేకపోవడంతో ఆ ఆఫీసు చేపల మార్కెట్‌లా తయారయ్యింది.

సెక్షనంతా పరికించి చూశారు ఆయన. ఒక గుమాస్తా సీట్లో హాయిగా వెనక్కువాలి కాళ్లు టేబుల్‌మీద తన్నిపెట్టి టైపిస్టు పిల్లతో మంతనాలు ఆడుతున్నాడు. మరొక గుమాస్తా టేబుల్‌మీద న్యూస్‌పేపర్ పరిచి శ్రద్ధగా చదువుతున్నాడు. మరొక లేడీ క్లర్క్ ఊలుతో భర్తకోసం స్వెట్టర్ అల్లుతోంది. మరొక ఇద్దరు వరండాలో నిలబడి క్రికెట్ కామెంటరీ వింటున్నారు. మరొకడు పుట్టింటికి వెళ్ళిన తన పెళ్లాంకి ఉత్తరం రాస్తున్నాడు. ఇంకొకడు గతరాత్రి తను చూసివచ్చిన సినిమా కథ గురించి మరొకడితో డిస్కస్ చేస్తున్నాడు. ప్యూన్ అయితే వెళ్ళి క్యాంటీన్‌లో కూర్చున్నాడు.

"సంజీవీ!... ఇదేమైనా బాగుందా? నీకు ఇచ్చిన ఫైలు మహా అర్జంటుది నాయనా... దాని సంగతి చూడు..." అన్నారు వెంకటపతిగారు.

"బాగుందండీ మీ వరస... ఇంతమంది ఇలా పనిచెయ్యకుండా ఆడుకుంటూ ఉంటే వాళ్ళందర్నీ ఏమీ అనకుండా... నామీద పడేశారేం మీ దృష్టి? అందర్లోకీ లోకువగా నేనే దొరికానా?" అంటూ విరుచుకుపడ్డాడు సంజీవి.

"అదికాదు నాయనా అందర్లోకీ సీనియర్‌వి. నువ్వే ఇలా పని మానేస్తే వాళ్లు నిన్నుచూసి నేర్చుకుంటున్నారు. పైగా నీకు ఇచ్చిన ఫైలు ఉంది చూశావూ, అది మహా అర్జంటు..." అంటూ నచ్చ చెప్పబోయారు ఆయన.

"అంత అర్జంటు ఫైలు నాకు ఎందుకు ఇయ్యాలి?... నా సంగతి తెలుసుగా... నా విషయంలో అర్జంటు అంటే ఆరునెలలు..."

తల పట్టుకుని కూర్చుండిపోయారు ఆయన. తప్పంతా తనదే.. ముందునుంచీ తను స్ట్రిక్టుగా ఉండాల్సింది. ఇప్పుడది మధ్యలో తెచ్చిపెట్టుకోలేకపోతున్నాడు తను. తనంటే బొత్తిగా లెక్కలేకుండా ప్రవర్తిస్తున్నారు వీళ్లు... ఈ మధ్య మరీ బరితెగించిపోయారు... ఇదివరకు ఇంత ఘోరంగా ఉండేదికాదు పరిస్థితి...

"ప్లీజ్ సంజీవీ.." అంటూ బ్రతిమాలారు.

ఆయన ముఖంలోకి చూసిన సంజీవి ఏమనుకున్నాడో తెలియదుగానీ ఒక్కసారిమాత్రం దీర్ఘంగా నిట్టూర్చి—

"సర్లెండి. ఆ ఫైలు విషయం ఈ రోజు చూస్తాను..." అంటూ సీట్లో కూర్చుని ఆ ఫైలు చూడసాగాడు. చుట్టూ రేగుతున్న రణగొణధ్వని విని భరించలేక చిరాగ్గా ముఖం పెట్టి—

"కాస్సేపయినా పన్లు చేసుకోండ్రా..." అంటూ ఒక సలహా పడేశాడు.

పనిచెయ్యడానికి మూడ్ వచ్చిందికాబోలు... అందరూ శ్రద్ధగా సీట్లలో కూర్చుని పనిచేసుకోసాగారు. ఆ దృశ్యం చూసిన వెంకటపతిగారి మనసు శాంతించింది. 'వీళ్ళు ఎప్పుడూ ఇలాగే తనకు శ్రమ ఇయ్యకుండా పని చేసుకుంటే ఎంత బాగుండును' అనుకున్నారు.

* * *

మరొక నాలుగురోజుల తర్వాత, ఆఫీసు వాతావరణం యథాప్రకారం చేపల బజారులా ఉన్న సమయంలో ఆయనకొక ఉత్తరం వచ్చింది. దాన్ని చదువుకుని ఏదో ఆలోచిస్తూ ఉండిపోయారు వెంకటపతిగారు. సంజీవి ఎవరితోనో అంటున్న మాటలు ఆయన చెవిన పడ్డాయి.

"ఛ... అవమానం... మీ ఆవిడచేత చివాట్లు తిన్నారా? ఎంతఘోరం... ఒక ఆడదానిచేత చివాట్లు తినడంకంటె ఆత్మహత్య చేసుకోవడం నయం..." వెంకటపతిగారు కల్పించుకున్నారు.

"ఏం సంజీవీ... ఏమిటి విషయం?"

"చూడండిసార్... నిన్న మన భగవాన్లు సెకండ్ షో సినిమాకు వెళ్లాడట... హాలు పక్కనే వున్న బార్‌లో కొంచెం మందు కొట్టాడట... అందుకని వాళ్ళావిడ చివాట్లు పెట్టిందట. అవన్నీ నోరుమూసుకుని భరించి వచ్చాడు. ఘోరం కదాండీ. మగపుట్టుక పుట్టి ఆఫ్టరాల్... ఒక ఆడదాని చేతుల్లో ఇలా... ఛీ..." ఇంకా ఆవేశపడిపోతూ మాట్లాడుతున్నాడు సంజీవి.

'అలాగా...' అన్నట్లు తలపంకించారు ఆయన.

"పెళ్లాంచేత చివాట్లు తింటే అంత గింజుకోనక్కర్లేదు... అదే ఏ ఆడ ఆఫీసరు చేతో తినాల్సివస్తే..." అన్నారు ఆయన.

"అది మరీ అవమానం... పెళ్ళాం విషయంలో కొంతసరిపెట్టుకోవచ్చు. కానీ ఆడ ఆఫీసరు విషయంలో అది కుదరదు..." అన్నాడు సంజీవి.

"అందుకేనయ్యా... మీ అందర్నీ చూస్తే నాకు జాలిగా వుంది..." అన్నారు.

ఆ మాటలకు సంజీవితోపాటు మిగతా అందరూ కూడా ఉలిక్కిపడ్డారు.

"ఏమైందిసార్?..." అన్నారు ఏకకంఠంతో గాభరాగా.

"ఇప్పుడు నాకు వచ్చిన ఉత్తరం ఇదే విషయం చెప్తోంది. మన మేనేజర్‌గారికి బదిలీ అయిపోయిందట. ఇక ఇక్కడకు రారు. ఆయన తిన్నగా హెడ్డాఫీసులో జాయినవుతారట. ఆయన బదులు ఒక ఆడ మేనేజర్ వస్తోంది. చాలా స్ట్రిక్టు మనిషట... వచ్చేనెల నాలుగో తారీఖున మన ఆఫీసు ఇనస్పెక్షను ఏడ్చింది. ఆవిడకూడా అదేరోజు వచ్చి మన పనిచేసే వైఖరిని గమనిస్తుందట... ఇనస్పెక్షన్లో ఎలాంటి అవకతవకలువచ్చినా ఆ తర్వాత ఆ ఆడపులి మన ప్రాణాలు కొరుకుతుందట..."

అందరూ ఆ మాటలువిని గాభరా పడిపోయారు.

'నిజమా' అన్నారు.

"అబద్ధం చెప్పవలసిన అవసరం నాకు ఏముందిగనుక? ఈ విషయాలన్నీ హెడ్డాఫీసులోవున్న ఒక మిత్రుడు రాశాడు. మీరు ఎంత గొప్పగా పనిచేస్తారో నాకు తెలుసుగా అందుకే బెంగ నాకు..." అన్నారాయన.

"ఆవిడపేరు ఏమిటండీ..." అంటూ అడిగింది ఒక లేడీ టైపిస్టు.

"వసంత అట... ఈ వసంతాగమనం మీ ప్రాణాలు కొరకడానికే. వసంతాగమనంలో కోయిలలు కూస్తాయట... చూద్దాం.. ఈ ఆఫీసులో కోయిలలే కూస్తాయో... ఆవిడ తీసుకోబోయే చర్యలవల్ల గుడ్లగూబలే అరుస్తాయో!"

ఆఫీసంతా నిశ్శబ్దం అలుముకుంది. ఎవరికివారు ఏదో ఆలోచించుకుంటూ ఉండిపోయారు.

ఆ మర్నాటినుంచీ ఆ ఆఫీసు వాతావరణం మారిపోయింది. ప్రతి ఒక్కరూ సీట్లో కూర్చుని శ్రద్ధగా పనిచేసుకోవడం మొదలుపెట్టారు. అంతవరకూ

**ఆ మర్నాటి నుంచీ ఆ ఆఫీసు వాతావరణం మారిపోయింది. ప్రతి ఒక్కరూ సీట్లో కూర్చుని శ్రద్ధగా పనిచేసుకోవడం మొదలుపెట్టారు. అంతవరకూ పెండింగ్ పనులు కూర్చుని మరీ పూర్తి చెయ్యసాగారు.**

పెండింగ్ గా ఉంచిన పనులు ఒక గంటసేపు ఎక్కువ కూర్చుని మరీ పూర్తిచేయసాగారు. వెంకటపతిగారికి వాళ్లను పోరవల్సిన అవసరం కలగటంలేదు. పనులన్నీ చకచకా నడిచిపోతున్నాయి. ఎవ్వరూ హస్కు కొట్టడంలేదు. న్యూస్‌పేపర్లు, సినిమా పుస్తకాలు చదవటంలేదు. భర్తకోసం అల్లబడుతున్న స్వెట్టర్ పని ఆగిపోయింది.

'ఎంతమార్పు... ఎంతమార్పు...' అంటూ బోలెడు సంతోషపడిపోయారాయన.

నాలుగోతారీకు వచ్చింది. హెడ్డాఫీసునుంచి ఇన్‌స్పెక్షన్ టీమ్ వచ్చింది. కానీ వాళ్లతో ఈ వసంతమ్మ రాలేదు. బహుశా తర్వాత వస్తుందేమో ఆవిడ అని సరిపెట్టుకున్నారు. తనిఖీలో ఒక్కలోటుకూడా కన్పించలేదు. టీమ్ చాలా సంతోషించింది. వెంకటపతిగార్ని మెచ్చుకున్నారు వాళ్ళు.

"శభాష్... మేనేజర్‌గారు లేకపోయినా ఎంతో ఎఫిషియంట్‌గా ఆఫీసు మైంటైన్ చేశారు. ఇది నిజంగా మీ గొప్పతనానికి తార్కాణం" అంటూ ఆ టీమ్‌లో వాళ్ళు ఆయన్ను పొగిడారు. ఆయన చిరునవ్వుతో ఆ పొగడ్తలకు కృతజ్ఞతలు తెలియచేసుకున్నారు. టీమ్ వెళ్లిపోయింది.

సంజీవి ఆ మర్నాడు అడిగేడు "సార్ వసంతగారు రాలేదేం?"

"అదెవరు?" అన్నారు ఆయన ఆశ్చర్యంగా.

"అదేమిటిసార్... మన కొత్త మేనేజరమ్మగారు."

"కొత్త మేనేజరూ లేదు... కొండనీటి చేంతాడూ లేదు.. శలవు ముగించుకుని మన పాత మేనేజరుగారే రేపు వస్తున్నారు..."

అందరూ ఆశ్చర్యపోయారు.

"అదేనిటిసార్?... ఆయనకు బదిలీ అనీ... ఆయన స్థానంలో ఒక ఆడమనిషి..."

"అదా... అంతా అబద్ధం..." అంటూ నవ్వేశారు ఆయన.

అందరి ముఖాల్లోనూ రంగులు మారుతుండటం గుర్తించి ఆయన అన్నారు.

"ఆరోజు వచ్చిన ఉత్తరం మన పాత మేనేజరు గారి దగ్గర్నుంచే. అనుకోకుండా శెలవు పొడిగించవల్సి వస్తోందనీ, ఈ ఇన్‌స్పెక్షన్ ఒకటి వున్నవిషయం తెలిపిందనీ కనుక నన్నే ఏదోరకంగా మేనేజ్ చేసుకోమనీ రాశారు. అది విని నా గుండెల్లో రాయిపడింది. ఆయన ఉంటే ఆయనకు భయపడి మీరు పన్లు చేస్తారు మీరు నాకు భయపడరు. బతిమాలితే లెక్కచెయ్యరు. ఎలాగా అని ఆలోచిస్తూ వుంటే 'ఆడదానిచేత చివాట్లు తినడం అవమానకరం' అంటూ సంజీవి అంటున్న మాటలు నా చెవిలో పడ్డాయి. అప్పుడే నాకు ఆలోచనవచ్చి ఈ ఆడమేనేజరు గురించి కల్పించి చెప్పాను. మీరంతా అందుకే పనిచేశారు అని నాకు తెలుసు. ఎలాగైతేనేం... ఈ ఇన్‌స్పెక్షన్ గండం గడిచింది..."

"మరి పేరుకూడా వసంత అని చెప్పారు..." అంటూ విస్ఫారం వేసింది శైలిపిస్తు.

"అవును... ఆ సమయంలో నోటికి వచ్చిన పేరు చెప్పాను..."

"మమ్మల్ని గొప్పగా హడలగొట్టి చంపారు అంకుల్" అన్నాడు సంజీవి నవ్వుతూ.

"చూడండి బాబూ... జీతం తీసుకుంటున్నందుకు పనిచెయ్యడం మన విధి. మధ్యమధ్యలో ఎప్పుడైనా ఆటవిడుపుగా కొంచెం రిక్రియేషన్ అవసరమే. కానీ మరీ ఇంత దారుణం కారాదు. ఏదో పెద్ద ముండావాడిని. నా మాట వినండి. శ్రద్ధగా పనిచెయ్యండి." అంటూ సలహా ఇచ్చారు ఆయన.

"అలాగే సార్..." అన్నారు అందరూ ముక్త కంఠంతో.

ఆ మర్నాడు పాత మేనేజర్‌గారు వచ్చి జాయిన్ అయ్యారు. ఇన్‌స్పెక్షన్లో ఎలాంటి అవకతవకలూ లేనందుకు వెంకటపతిగార్ని మెచ్చుకున్నారు.

చిన్నగా నవ్వి ఊరుకున్నారు వెంకటపతిగారు. *

